క్లుప్తంగా

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి


పథకాల గురించి వివరిస్తున్న నాయకులు

దేవనకొండ: ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఆలూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బి.విరూపాక్షిని గెలిపించాలని జెడ్పీటీసీ రామకృష్ణ, పాతఊర్ల మండల కన్వీనర్ తపాల శ్రీను కోరారు. శనివారం దేవనకొండలో వారు ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి పథకాలను ప్రజలకు వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సీఎం జగనన్న హయాంలోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కో-కన్వీనర్ కబీర్‌దాసు, కార్యకర్తలు టోపీ యూసుఫ్, జుబేర్‌సాబ్, గుంటిన్న, మద్దిలేటి, జనార్థన్ పాల్గొన్నారు.

బ్రహ్మేశ్వరుని సేవకు వెండి వస్తువుల బహూకరణ


దాతలను సత్కరిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణ సమీపంలోని బ్రహ్మగుండం క్షేత్రంలో వెలసిన కామేశ్వరీదేవి బ్రహ్మేశ్వరస్వామి సేవకు అనంతపురం జిల్లాకు చెందిన రిటైర్డ్ ఎలక్ట్రికల్ ఎస్ఈ రమణమూర్తి, కుటుంబ సభ్యులతో కలిసి వెండి వస్తువులు బహూకరించారు. శనివారం దాతలు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి రూ.55 వేల విలువ చేసే వెండి శఠగోపం, పళ్లెంలను స్వామి వారి సన్నిధిలో ఆలయ ఈఓ రామాంజనేయులు, అర్చకులకు అందించారు. దాతలను ఈఓ ఆలయ మర్యాదలతో సత్కరించారు.

నీటి పరిష్కారానికి హామీ ఇచ్చారు

మద్దికెర: మండల పరిధిలోని బురుజుల గ్రామ సమీపంలో రిజర్వాయర్ నిర్మించి నీటిని సరఫరా చేసి శాశ్వతంగా నీటి సమస్య పరిష్కారిస్తానని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హామీ ఇచ్చారని వైఎస్సార్‌సీపీ నాయకులు అనిమిరెడ్డి, జయభరత్‌రెడ్డి తెలిపారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె సానుకూలంగా స్పందించారన్నారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం

ఆలూరు: ఎన్నికలకు సర్వం సిద్ధం చేశామని ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు మీర్ తారిఖ్ అలీ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 294 పోలింగ్ బూత్‌లకు (కేంద్రాలకు) తరలించేందుకు ఈవీఎంలను సిద్ధం చేశామన్నారు. ఆదివారం ఉదయం 7 గంటల్లోపు పీఓ, ఏపీఓ, ఓపీఓలు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దకు చేరుకుని ఎన్నికల సామగ్రిని తీసుకొని సాయంత్రంలోపు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాన్నారు. 294 పోలింగ్ కేంద్రాలకు 588 మంది పీఓలు, ఏపీఓలు, 1,178 ఓపీఓలు, మరో 500 మంది రిజర్వ్‌డ్‌లో ఉంచామన్నారు. 700 మంది పోలీసులు, 600 మంది పారామిలటరీ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు 54 ఆర్టీసీ బస్సులు, 30 మినీ బస్సులు, 15 ట్యాక్సీలను ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట ఆర్ఓ డి.రామునాయక్, తహసీల్దార్ చంద్రశేఖర్, సీఐ బి.వెంకటేశ్వర్లు ఉన్నారు.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు

హొళగుంద: సార్వత్రిక ఎన్నికల్లో గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ పెద్దయ్యనాయుడు హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంలోకి ఏజెంట్లు ఎలాంటి వస్తువులు తీసుకురాకూడదన్నారు. టిఫిన్, భోజనం సమయంలో మాత్రమే రిలీవర్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రిసైడింగ్ ఆఫీసర్ సంతకం ఉన్న ఓటరు జాబితా ఏజెంట్ వద్ద ఉండాలన్నారు. ఓటర్లు తమ వాహనాలను పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలో ఉంచాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్ర 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు.

మంచికి మద్దతుగా నిలవాలి

- వైఎస్సార్‌సీపీ ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి విరూపాక్షి

ఆలూరు: పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని ఆ పార్టీ ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి బుసినే విరూపాక్షి కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ కూటమి అభ్యర్థులు అధికారం కోసం అబద్ధాలకు తెగబడుతున్నారన్నారు. వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించే వైఎస్సార్‌సీపీనే గెలిపించుకోవాలని కోరారు. చంద్రబాబునాయుడు రాజకీయ లబ్ధి కోసం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. చంద్రబాబు మాయమాటలు నమ్మకుండా ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి కర్నూలు ఎంపీగా బీవై రామయ్యను, ఆలూరు ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని విరూపాక్షి కోరారు.

మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తా

- వైఎస్సార్‌సీపీ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి


వెల్దుర్తిలో శ్రీదేవి రోడ్‌షోకు హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

వెల్దుర్తి(కృష్ణగిరి): మరోసారి తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని వైఎస్సార్ సీపీ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం వెల్దుర్తిలో రోడ్‌షో నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి పాతబస్టాండు వరకు సాగింది. అక్కడ ప్రజలనుద్దేశించి శ్రీదేవి మాట్లాడారు. తన భర్త చెరుకులపాడు నారాయణరెడ్డి ఆశయాలకనుగుణంగా తాను గెలుపొందిన నాటి నుంచి నియోజకవర్గ ప్రజల సేవలో గడుపుతున్నానన్నారు. గతంలో టీడీపీ నాయకులు తీర్చలేని సమస్యలనెన్నో తాను పరిష్కరించానన్నారు. రూ.3.5కోట్లతో కృష్ణగిరి రిజర్వాయర్ నుంచి నీటిని తెచ్చి వెల్దుర్తి మండల కేంద్రంలోనే తాగు నీటి సమస్యను పరిష్కరించానన్నారు. రూ.12 కోట్ల వ్యయంతో రామళ్లకోట డబుల్ రోడ్డు, రూ.6.70 కోట్లతో 30 పడకల సీహెచ్‌సీ నూతన భవనం, డాక్టర్ల, సిబ్బంది నియామకం చేపట్టినట్లు తెలిపారు. చెరువులకు నీరందించడంతో భూగర్భ జలాలు పెరిగి రైతులు పంటలు బాగా పండించుకుంటున్నారన్నారు. ఈనెల 13న ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ బీసీల పార్టీ అని చెప్పుకుంటూ జిల్లాలో బీసీలకు జరిగిన అన్యాయంపై మాట్లాడకపోవటం సిగ్గుచేటన్నారు. చెరుకులపాడు నారాయణరెడ్డితో పాటు హత్యకు గురైన బీసీ వ్యక్తి సాంబశివుడు ఇక్కడి టీడీపీ నాయకులకు గుర్తులేకపోవడం సిగ్గుచేటన్నారు. టీడీపీ నాయకుల బెదిరింపులకు తలొగ్గేదిలేదని, తమ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని అన్నారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పార్టీ కార్యకర్త ఎల్లకృష్ణ (ఏసు)ను గుర్తు చేసుకుని, నిమిషం పాటు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కంగాటి రామ్మోహన్ రెడ్డి, బొమ్మన రవిరెడ్డి, సమీర్‌కుమార్ రెడ్డి, సుంకన్న, శైలజ, వెంకట్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రదీప్‌రెడ్డి. పక్కన కంగాటి శ్రీదేవి



జొన్నగిరిలో నిర్వహించిన రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న శ్రీదేవి, తరలివచ్చిన ప్రజలు

జొన్నగిరిలో..

తుగ్గలి: మండల పరిధిలోని జొన్నగిరిలో వైఎస్సార్ సీపీ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి రోడ్ షో నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు జిట్టా నాగేష్ ఆధ్వర్యంలో బస్టాండ్ నుంచి ప్రారంభమైన రోడ్‌షో ప్రధాన వీధిగుండా ఎస్సీ కాలనీ వరకు సాగింది. అక్కడ శ్రీదేవి మాట్లాడుతూ అధికారం ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల మధ్యలోనే తానున్నాని, భవిష్యత్తులో కూడా ఉంటానని హామీ ఇచ్చారు. ఎన్నికల తర్వాత టీడీపీ నాయకులు ఎక్కడుంటారో ప్రజలే తెలుసుకోవాలన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి అపరిష్కృతంగా ఉన్న సీసీ రోడ్డు సమస్యను రూ.5కోట్లు ఖర్చుచేసి పరిష్కరించామన్నారు. చెరువుకు నీళ్లు రావాల్సి ఉందని అయితే ముందున్న చెరువులు నిండితేనే ఈ చెరువుకు నీళ్లు రావాల్సి ఉన్నందున ఆలస్యమైందన్నారు. గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలంటే చెరువుకు ప్రత్యేక పైపులైన్ ద్వారా నీళ్లు మళ్లించాలని జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆయనకు సానుకూలంగా స్పందించారని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడగానే చెరువుకు ప్రత్యేక పైపులైన్ ద్వారా నీటిని మళ్లిస్తామని హామీ ఇచ్చారు. ఈనెల 13న రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీగా బీవై రామయ్యను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఆమె కోరారు. ప్రచారంలో పార్టీ నాయకులు పులికొండనాయక్, పక్కీరప్ప, నాగప్ప, గుంత దేవి, రఘు, సోమశేఖర రెడ్డి, భాస్కరరెడ్డి, తేరప్ప, ప్రకాష్, శీనివాసులు, దివాకర్, సుంకన్న పాల్గొన్నారు.


మల్లాపురంలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న జెడ్పీటీసీ కేఈ సుభాషిణి


ఆలంకొండలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఆర్‌బీ వెంకటరాముడు

వైఎస్సార్‌సీపీకి ఓటు వేయండి

కృష్ణగిరి: పేదలకు సంక్షేమాన్ని అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఓటు వేసి ఆదరించాలని జెడ్పీటీసీ కేఈ సుభాషిణి, పార్టీ మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడు కోరారు. మండల పరిధిలోని జి.మల్లాపురం, ఆలంకొండ గ్రామాల్లో శనివారం వారు ప్రచారం నిర్వహించి మోడల్ బ్యాలెట్ బాక్స్‌లపై ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈనెల 13న ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి కర్నూలు ఎంపీగా బీవై రామయ్యను, పత్తికొండ ఎమ్మెల్యేగా కంగాటి శ్రీదేవిని గెలిపించాలని కోరారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహించారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

బురుజుల గ్రామంలో..

మద్దికెర: ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు భరత్‌రెడ్డి, నరసింహారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శనివారం వారు మండల పరిధిలోని బురుజుల గ్రామంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కంగాటి శ్రీదేవిని, ఎంపీగా బీవై రామయ్యను గెలిపించాలని కోరారు.


జొహరాపురంలో మాట్లాడుతున్న బుసినె విరూపాక్షి

తాగునీటి సమస్యను పరిష్కరిస్తా

- వైఎస్సార్‌సీపీ ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి విరూపాక్షి


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న విరూపాక్షి

ఆస్పరి: ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మండలంలోని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానని వైఎస్సార్‌సీపీ ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి బుసినే విరూపాక్షి హామీ ఇచ్చారు. శనివారం మండలంలోని జొహరాపురం గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ మసాల పద్మజ, నాయకులు వైకుంఠం మల్లికార్జున చౌదరితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా విరూపాక్షి మాట్లాడుతూ ఒక్క సారి తనకు అవకాశం ఇస్తే జొహరాపురం వద్ద సమ్మర్ స్టోరేజీ ఏర్పాటు చేసి హంద్రీనీవా నీటితో మండలంలోని అన్ని గ్రామాల తాగు నీటి సమస్యను పరిష్కరిస్తానన్నారు. అలాగే నియోజకవర్గంలో తాగు నీటి సమస్యతో పాటు ప్రతి గ్రామానికి రహదారులు ఏర్పాటు చేయిస్తానన్నారు. ఈనెల 13న ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి కర్నూలు ఎంపీగా బీవై రామయ్యను, ఆలూరు ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. అంతకు ముందు పెద్దమ్మవ్వ, బంగారమ్మవ్వ ఆలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు మూలింటి రాఘవేంద్ర, బసవరాజు, పెద్దయ్య, సంజీవరెడ్డి, నెల్లూరప్ప, దత్తాత్రేయరెడ్డి, జేడీ రంగస్వామి, తిమ్మప్ప, రాధాక్రిష్ణ, తోయజాక్షప్ప, వేణుగోపాల్, దుమ్మా నరసింహులు, రంగస్వామి, శివకోటి, సంజప్ప, నేనేపాటి, ప్రభాకర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

కరివేములకు చెందిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శ్రీనివాసులు, క్రిష్ణ, ఈరన్న, వెంకన్న, లక్ష్మన్న, రామాంజిని, చాకలి శ్రీనివాసులు, వెంకటేష్‌తో పాటు 40 కుటుంబాలు బుసినె విరూపాక్షి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి విరూపాక్షి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

మద్దిలింగదహళ్లి గ్రామంలో..

హొళగుంద: మండల పరిధిలోని మద్ది లింగదహళ్లి తదితర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకురాలు శశికళ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు కృష్ణమోహన్, సౌజన్య, షఫీవుల్లా, రంగస్వామి, తిక్కన్నతో కలిసి ఆమె ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. అంతకుముందు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు బావిదొడ్డి వీరారెడ్డి, శివకుమార్‌రెడ్డి, రామలక్ష్మిరెడ్డి, కురువ వీరనాగప్ప దంపతులు వైఎస్సార్‌సీపీలో చేరారు.

హుళేబీడు గ్రామంలో..


ప్రచారం చేస్తున్న శశికళ

ఆలూరు: మండలంలోని హుళేబీడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు, కురువ సంఘం నాయకురాలు శశికళ, వైకుంఠం మల్లికార్జునచౌదరి, ఆలూరు సింగిల్ విండో మాజీ చైర్ పర్సన్ సౌమ్యారెడ్డి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యను, ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షిని గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఎంపీపీ రంగమ్మ, జెడ్పీటీసీ ఏరూరు శేఖర్, మండల కన్వీనర్ ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకే మాలలు మద్దతు


మాట్లాడుతున్న గుడిసె మహానంది

ఆస్పరి: మాలల సంపూర్ణ మద్దతు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకేనని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గుడిసె మహానంది అన్నారు. శనివారం ఆస్పరిలో ఏర్పాటు చేసిన మాల మహానాడు సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీల కతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబునాయుడు మోసపూరితమైన మేనిఫెస్టోతో ప్రజలను మోసం చేశాడన్నారు. చంద్రబాబునాయుడు చెప్పే మాయ మాటలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. దళితుల మధ్య చిచ్చు పెట్టడమే చంద్రబాబు ధ్యేయమన్నారు. కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి బుసినె విరూపాక్షి విజయానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు వీరేష్, మల్లికార్జున, శివ, రామాంజనేయులు, రామాంజినమ్మ, సావిత్రమ్మ, సుహాసిని, రత్నమ్మ, వనిజ, శిరీష పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం


ఓటర్లకు ఈవీఎం మిషన్‌లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న నాయకులు


దేగులహాల్‌లో ఉపాధి కూలీలకు ఈవీఎంపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

హాలహర్వి: మండలంలోని కొక్కరచేడు, ఆపురం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు నగేష్, మల్లికార్జున శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలు, కొత్తగా విడుదల చేసిన మేనిఫెస్టో ప్రతులను వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర, రాఘవేంద్రరెడ్డి, గోపాల్, రామకృష్ణ, దర్గప్ప, కృష్ణ, రామరాజు, బసవరాజుగౌడ్, వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

చిప్పగిరి మండలంలో..

చిప్పగిరి: ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు వైకుంఠం మల్లికార్జున చౌదరి, బెల్డోణ సొసైటీ అధ్యక్షులు మల్లికార్జున కోరారు. శనివారం వారు మండలంలోని రామదుర్గం, డేగలహాలు తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి విరూపాక్షికి ఓటు వేయాలని కోరుతూ కర పత్రాలను పంపిణీ చేశారు. బ్యాలెట్ నమూనాపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రచారంలో నాయకులు రోహిని, ప్రేమ్‌కుమార్, సత్తి రెడ్డి, ఈరప్ప, లాల్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి

- నలుగురు టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు

కృష్ణగిరి: మండల కేంద్రమైన కృష్ణగిరిలో శనివారం రాత్రి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. వైఎస్సార్‌సీపీ కార్యకర్త మన్సూర్, టీడీపీ కార్యకర్త ఎరుకల విజయ్ మధ్య చిన్న విషయానికి మాటామాటా పెరిగి మాన్సూర్‌పై దాడి చేశాడు. గమనించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు బోయ సుంకన్న, వెంకటరాముడు, షేక్ హుసేన్‌లు విడిపించేందుకు వెళ్లగా వీరందరిపై కట్టెలతో దాడులకు పాల్పడినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు విజయ్‌తోపాటు లోకేష్, దేవేంద్ర, సలీమ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. ప్రశాంత గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు ఇలాంటి దాడులకు పాల్పడటంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

- జగనన్న కాలనీల్లోని స్థలాల రిజిస్ట్రేషన్
- పేదలకు సర్వ హక్కులతో రూ.లక్షల విలువైన ఆస్తి
- నియోజకవర్గంలో 71 లేఅవుట్లు, 14,159 మంది లబ్ధిదారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

పేదలకు పక్కాగా ఆస్తి


చిప్పగిరి మండలం రామదుర్గంలోని జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

నాడు: గతంలో ప్రభుత్వాలు ఇళ్ల లబ్ధిదారులకు డి-పట్టాలు ఇచ్చేవి. గృహ నిర్మాణ రుణం కోసం ఆ పట్టాలను హౌసింగ్ కార్పొరేషన్‌కు తాకట్టు పెట్టుకునేవి. లబ్ధిదారులకు ఎలాంటి హక్కులూ ఉండేవి కాదు. రూపాయి అప్పు పుట్టేది కాదు. రిజిస్ట్రేషన్‌కు వీలులేక అత్యవసర పరిస్థితుల్లో తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి.

నేడు: ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పదేళ్ల తర్వాత ఇంటిపై సర్వ హక్కులు ఉండేలా లబ్ధిదారుల పేరిట స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి కన్వేయన్స్ డీడ్‌ను అందజేసింది. అందుకోసం అసైన్డ్ భూముల చట్టాన్ని ప్రభుత్వం సవరించింది. పదేళ్ల తర్వాత ఇవి సేల్‌డీడ్‌లుగా మారుతాయి. తద్వారా లబ్ధిదారులకు సదరు ఇంటిపై సర్వహక్కులు సంక్రమిస్తాయి.

ఆలూరు రూరల్: రాష్ట్రంలో పేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్థలాలు ఇచ్చి గృహనిర్మాణానికి ప్రోత్సాహం అందించారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో స్థలాలు ఇచ్చి చారిత్రాత్మక అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి పత్రాలను లబ్ధిదారులకు అందించారు.

నియోజకవర్గంలో 14,159 మందికి

నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కింద ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 71 లేఅవుట్లలో 14,159 మందికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పంపిణీ చేసింది. గృహ నిర్మాణానికి రూ. 1.80 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించింది. అలాగే మరో రూ.35 వేల డ్వాక్రా రుణాన్ని మంజూరు చేసింది. రాయితీపై ఐరన్, సిమెంటుతో పాటు ఉచితంగా ఇసుక అందిస్తోంది. అలాగే జగనన్న కాలనీల్లో లక్షలాది రూపాయలతో తాగు నీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యం కల్పిస్తోంది. దీంతో కాలనీల్లో ఇల్లు రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు విలువ చేస్తాయని అంచనా. సచివాలయాల ద్వారా జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రభుత్వం గత ఫిబ్రవరి నెలలో పూర్తి చేసింది. ప్రభుత్వం తరుపున వీఆర్వో లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. గ్రామ, వార్డు సచివాలయాలను జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కన్వేయన్స్ డీడ్‌లో తప్పులు రాకుండా ఉండటంతో పాటు నిర్ణీత గడువు నాటికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేసేలా లబ్ధిదారులని ప్లాటు నంబర్, సరిహద్దులు ఆన్‌లైన్‌లో పొందుపరిచింది.

ప్రయోజనం ఇలా..

- ➡ స్థలం రిజిస్ట్రేషన్ ద్వారా ఇంటిపై లబ్ధిదారులకు హక్కులు సంక్రమించాయి.
- ➡ ఇంటిని బ్యాంకులో తాకట్టు పెట్టి రుణసాయం పొందే అవకాశం కలిగింది.
- ➡ ఇంటి విలువ పెరిగి కొనుగోలుకు డిమాండ్ ఏర్పడింది.
- ➡ అత్యవసర సమయాల్లో ఇంటిని అమ్ముకునే వీలు కలిగింది.
- ➡ వారసులకు గిఫ్ట్ డీడ్ కింద ఇంటిని బదలాయించుకునే వెసులుబాటు అందుబాటులో వచ్చింది.


హత్తిబెళగల్ గ్రామంలో జగనన్న కాలనీలో నిర్మించిన ఇల్లు

రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం సంతోషం



రెక్కాడితో డొక్కాడని కుటుంబం మాది. నా భర్త, ఇద్దరు పిల్లలతో 15 ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాం. ఇంటి కోసం గతంలో చాలా సార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదు. సీఎం జగన్ వచ్చిన తర్వాత స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల సాయం, రూ.35 వేల డ్వాక్రా రుణం ఇవ్వడంతో మా సొంతింటి కల సాకారమైంది. గత ఫిబ్రవరి నెలలో స్థలాన్ని నా పేరిట రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారు. రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడంతో చాలా ఆనందంగా ఉంది.

– అరికెర లక్ష్మి, కురువళ్లి గ్రామం

ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలి


బీఎల్ఓలతో మాట్లాడుతున్న తహసీల్దార్

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని వెల్దుర్తి మండల అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, తహసీల్దార్ అనంతాచారి సూచించారు. శనివారం ఆయన ఎంపీడీఓ శివశంకరప్ప, డీటీ శర్మతో కలిసి మండలంలోని బూత్ లెవల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఓటరు స్లిప్పు అందరికీ అందేలా చూడాలన్నారు. స్లిప్పు అందుకోని వారికి ఎన్నికల రోజు పోలింగ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసే హెల్పింగ్ డెస్క్ ద్వారా అందించాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే మండలంలోని 58 బూత్‌ల పరిధిలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని 208 (వెల్దుర్తి జెడ్పీ హైస్కూల్ గది), 203 (అల్లుగుండు ఎంపీపీ స్కూల్ గది) బూత్‌లను మోడల్ బూత్‌లుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. పోలింగ్ ఉదయం 7గంటలకు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అభ్యర్థుల ఏజెంట్లు కూడా సహకరించాలని కోరారు. పోలింగ్ స్టేషన్ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.